సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



రత్నగిరికి పండగొచ్చింది


రత్నగిరికి పండగ శోభ వచ్చింది.. వచ్చే నెల మూడో తేదీ నుంచి దసరా వేడుకలు, నవంబర్ రెండో తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. - 8లో



ఎక్కువ వడ్డీకి ఆశపడి డిపాజిట్ చేశాం

ఎక్కువ వడ్డీ వస్తుందని ఆశ పడి తమ వద్ద ఉన్న డబ్బులు మొత్తం జయలక్ష్మి బ్యాంకులో డిపాజిట్లు చేసి మోసపోయామని పలువురు డిపాజిటర్లు ఆవేదన వెల్లబుచ్చారు. - 8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 1,79,329 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 9,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

కొత్తపేట ఆర్డీఓగా శ్రీకర్



కొత్తపేట: కొత్తపేట ఆర్డీఓగా పి.శ్రీకర్ నియమితులయ్యారు. గుంటూరులో పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. అసెంబ్లీ, లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల ముందు ఇక్కడ ఆర్డీఓగా నియమితులై ఇంతవరకూ పని చేసిన జీవీవీ సత్యనారాయణను ప్రభుత్వ కార్యదర్శి (పొలిటికల్) వద్ద రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఏర్పడిన తరువాత శ్రీకర్ 3వ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టనున్నారు.

అమలాపురం ఆర్డీఓగా మాధవి

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్డీఓగా కె.మాధవి రానున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ ఆర్డీఓగా పనిచేసిన కేశవవర్ధన్‌రెడ్డిని కనిగిరి ఆర్డీఓగా బదిలీ చేశారు. కడప జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.మాధవి ఇక్కడకు ఆర్డీఓగా వస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



రామేశ్వరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

సఖినేటిపల్లి: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని, పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. శుక్రవారం రామేశ్వరం హైస్కూల్ ప్లస్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలకు విద్యార్థులకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. అన్ని సబ్జెక్ట్‌ల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తర్వాత మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సెక్టోరియల్ జిల్లా అధికారి బి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-1, 2 డి.కిశోర్‌కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, మలికిపురం ఎంఈఓ-1 ఎం.జయశ్రీ, హెచ్‌ఎం ఎంజీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

మలికిపురం: ఉపాధి లేక అల్లాడుతున్నామంటూ రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇంటి ముందు భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే నివాసం వద్ద ఈ మేరకు ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఇసుక లేక నిర్మాణాలు ఆగిపోయాయని, కూలి పనులు లేక ఇబ్బంది పడుతున్నామని వారు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. వెంటనే ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక సరఫరాలో అనేక ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ కార్మికులు వినతిపత్రం అందించారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

ఇదేమి సంత..

- జిల్లాలోని సంతల్లో సౌకర్యాలు మృగ్యం
- ఆదాయం వస్తున్నా కానరాని అభివృద్ధి
- ఇటు వైపు చూడని యంత్రాంగం



ఐ.పోలవరం మండలం మురమళ్లలో జాతీయ రహదారిని ఆనుకుని వారపు సంత నిర్వహణ

ఐ.పోలవరం: పల్లెల్లో వారపు సంతలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. నేటికీ పెద్ద ఎత్తున జనంతో రద్దీ నెలకొంటోంది. ఇక్కడ జరిగే వ్యాపారం ద్వారా పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వెంటాడుతోంది. సంతకెళ్తే బురద దారులు, గతుకుల రోడ్లు, ఎండలో.. ఆపై రోడ్లపై వ్యాపారాలు ఇలా చెప్పుకొంటూ పోతే ఎన్నెన్నో సమస్యలు దర్శనమిస్తున్నాయి.. కనీస సదుపాయాలు లేక ఇటు వ్యాపారులు, కొనుగోలుదారులు సైతం 'ఇదేం సంత బాబోయ్' అంటున్నారు. జిల్లాలో ప్రధాన వారపు సంతల్లో సమస్యలపై 'సాక్షి' పరిశీలన ఇది.

జిల్లాలో పలు వారపు సంతలకు ఆ గ్రామాలకు చెందిన వారే కాకుండా, చుట్టుపక్కల మండలాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. ఈ సంతల ద్వారా అనేక వందల మంది వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. ఒక్కొక్క సంతను బట్టి రోజుకు రూ. ఐదు లక్షల నుంచి రూ.పదిహేను లక్షల వరకూ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. దాదాపు అన్ని సంతలకు కాట్రేనికోన, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు, సఖినేటిపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున మత్స్యకారులు వచ్చి సముద్ర ఉత్పత్తులు, చెరువుల నుంచి తెచ్చిన రొయ్యలు, చేపల విక్రయాలు జరుపుతుండడం విశేషం. కొత్తపేటలో సోమవారం జరిగే వారపు సంతకు మంచి గుర్తింపు ఉంది. కొత్తపేటతో పాటు రావులపాలెం, అయినవిల్లి, పి.గన్నవరం మండలాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. ఇక్కడ వారపు సంతతో పాటు డైలీ మార్కెట్ కూడా నిర్వహిస్తున్నారు. అయితే వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఆలమూరులో మంగళవారం వారపు సంత జరుగుతోంది. ఇక్కడ కనీస వసతులు లేవు. ఇక్కడి శిథిల భవనాల వద్ద రైతులు షెడ్లు వేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు.

- కాట్రేనికోన మండలం కాట్రేనికోన, పల్లంకుర్రులలో వారపు సంతలు జరుగుతుంటాయి. ఈ మండలంలో మత్స్యకార గ్రామాలు అధికంగా ఉండడంతో ఇక్కడకు అధిక సంఖ్యలో మత్స్యకారులు, కొనుగోలుదారులు వస్తుంటారు. పల్లంకుర్రులో సంత జరిగే ప్రదేశం ఆక్రమణకు గురికావడంతో వ్యాపారుల రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడ చిన్నపాటి వర్షం పడితే బురదగా మారుతోంది. అక్కడ బరకాలు, గడ్డి వేసుకుని వ్యాపారాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.
- రాజోలు దీవిలో మలికిపురంలో అతి పెద్ద సంత జరుగుతోంది. దీనితో పాటు రాజోలు, తాటిపాకల్లో సైతం వారపు సంతలు నిర్వహిస్తుంటారు.



అంబాజీపేట సంతలో బురద

మలికిపురం సంతలో రోజువారీ వ్యాపారం రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ ఉండగా, ఆదివారం సంతలో రూ.ఐదు లక్షల వరకూ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. ఇక్కడ సౌకర్యాలు అంతంత మాత్రగానే ఉన్నాయి.

ఎండైనా.. వానైనా..



ఎండకు గొడుగులు వేసుకుని చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

అంబాజీపేట సంతకు ఉమ్మడి జిల్లాలో మంచి పేరు ఉండేది. ఇక్కడ వారపు సంతతోపాటు పశువుల సంత కూడా జరుగుతోంది. అంబాజీపేట, అల్లవరం, కొత్తపేట, అయినవిల్లి, అమలాపురం నుంచి జనం వస్తుంటారు. ఇక్కడ సంతలో వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు చాలా వరకు శిథిలమయ్యాయి. ఒకటి మాత్రమే వినియోగంలో ఉంది. మరొకటి కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనితో చేపలు, రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తులు అమ్మకాలు చేసేవారు, కూరగాయ వ్యాపారులు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది. కొద్దిపాటి వర్షానికే సంత బురద మయంగా మారుతోంది. మహిళలకు టాయిలెట్ల సదుపాయం లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. పన్నులు వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో స్థానిక పంచాయతీ విఫలమవుతోంది.

- రాయవరంలో మంగళవారం, సోమేశ్వరంలో సోమవారం వారపు సంత జరుగుతోంది. షెడ్లు ఉన్నా అధ్వానంగా మారాయి. వర్షం వస్తే లోపలకు నీరు వస్తుంది. చాలామంది ఆరుబయటే దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు.

అనువైన స్థలం లేక..



అంబాజీపేట మార్కెట్‌లో వ్యాపారం చేసుకునేందుకు అనువైన స్థలం లేదు. ఒకే షెడ్డు ఉంది. అందరూ కూర్చునేందుకు అది సరిపోదు. రెండోవది ఎప్పుడు కూలుతుందో అన్నట్టుగా ఉంది. ఎండైనా.. వానైనా ఆరుబయటే వ్యాపారం సాగించాల్సి వస్తోంది. అంబాజీపేటలోనే కాదు.. వారంలో మేము వెళ్లే ప్రతి సంతా ఇలాగే ఉంటోంది. చాలా ఇబ్బంది పడుతున్నాం.

– లంకే సీతారత్నం, చేపల వ్యాపారి

రోడ్డు చెంతనే వ్యాపారం



వారపు సంతల్లో సౌకర్యాలు లేకపోవడం వల్ల రోడ్ల చెంతనే తాత్కాలికంగా దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది. మురమళ్ల వారపు సంతకు చాలా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తారు. కానీ అక్కడ సౌకర్యాలు లేకుండా పోయాయి. వినియోగదారులతో పాటు వ్యాపారులూ ఇబ్బంది పడుతున్నారు.

– మట్టపర్తి జానకిరామయ్య, పండ్ల వ్యాపారి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా విశ్వరూప్



అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రాష్ట్ర మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. తాడేపల్లిలోని జిల్లా పార్టీ ముఖ్య నేతల సమావేశం శుక్రవారం జరిగింది. దీనికి హాజరైన విశ్వరూప్‌ను జిల్లాకు చెందిన నాయకుల ఏకాభిప్రాయంతో నియమించారు. ఆది నుంచీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విధేయుడిగా ఉన్న విశ్వరూప్ కాంగ్రెస్ నేతగా అంచెలంచెలుగా ఎదిగారు. రాజశేఖరరెడ్డి ఆశీస్సులతోనే ఆయన తొలిసారిగా ముమ్మిడివరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రి అయ్యారు. రాజశేఖరరెడ్డి మరణం తర్వాత అదే విధేయతను వైఎస్ జగన్‌పై చూపించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిన నాటి నుంచే పార్టీలో కీలక నేతగా ఎదిగారు. ఆయన అమలాపురం నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2019లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగన్ ప్రభుత్వంలో రెండో సారి మంత్రి పదవి చేపట్టారు. ఇలా తండ్రీ కొడుకుల ప్రభుత్వాల్లో మంత్రి పదవి చేసి వారిద్దరి పట్ల తన విధేయతను, విశ్వాసాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన విశ్వరూప్‌ను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, జక్కంపూడి రాజా, పార్టీ నాయకుడు పిల్లి సూర్యప్రకాష్ తదితరులు అభినందించారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె విరమణ



చొప్పెల్ల ఎఫ్‌డీపీలో రోగులకు సేవలందిస్తున్న వైద్యాధికారి సువర్చలాదేవి

ఆలమూరు: రాష్ట్ర వ్యాప్తంగా పది రోజుల నుంచి జరుగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మెను శుక్రవారం విరమించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పీహెచ్‌సీ వైద్య ప్రతినిధులు గురువారం రాత్రి నిర్వహించిన మూడో దశ చర్చలు విజయవంతం అయ్యాయి. దీంతో సమ్మెను విరమించి విధులకు హాజరవుతున్నట్లు జిల్లా వైద్య సమాఖ్య తెలిపింది. శుక్రవారం అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులంతా విధులకు హాజరై తమ సేవలను అందించారు. వైద్య ఆరోగ్య శాఖ అమలులో ఉన్న క్లీనికల్, నాన్ క్లీనికల్ విభాగంలో సీట్లు 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించగా, తాజాగా జరిగిన చర్చల్లో 20 శాతానికి ఒప్పందం కుదిరింది. అలాగే గతంలో ఉన్న 19 కేటగిరీల రిజర్వేషన్‌ను ఆరు కేటగిరీలకు కుదించగా మళ్లీ యథాస్థితిని ప్రభుత్వం కొనసాగించనుంది. దీర్ఘకాలికంగా డిమాండు చేస్తున్న విధంగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ), ట్రైబుల్ ఏరియాలో విధుల నిర్వహించే వైద్యులకు అదనంగా అలవెన్సులు ఇచ్చేందుకు అంగీకరించింది.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సాయిరామ్

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్-14, 17, 19 బాస్కెట్‌బాల్, నెట్‌బాల్, తైక్వాండో పోటీలకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో వారిని అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి క్రీడా పోటీలు కాకినాడ డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా ప్రాంగణంలో జరిగాయి. అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో కేఎస్‌వీ ప్రసాద్, జి.సిరిమల్లి, కె.లక్ష్మీప్రసన్న, అండర్-17 విభాగంలో నిమ్మకాయల చరిష్మాసాయిరుత్వి, మండపేటలో జరిగిన జిల్లా స్థాయి నెట్‌బాల్ అండర్-19 విభాగంలో కె.కీర్తన, కాకినాడలో జరిగిన అండర్-14 తైక్వాండోలో పి.చర్యణశ్రీలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో గుంటూరులో జరిగే రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు, నెల్లూరులో జరిగే నెట్‌బాల్ పోటీలకు, తిరుపతిలో జరిగే తైక్వాండో పోటీలకు ఈ ఆరుగురు విద్యార్థులు హాజరుకానున్నారు. తర్ఫీదు ఇచ్చిన పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ ఎ.సూర్యకుమారి, సీనియర్ తైక్వాండో కోచ్ పి.త్రిమూర్తులతో పాటు విద్యార్థులను హెచ్‌ఎం సాయిరామ్, పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, ఎం.ఎల్.గాయిత్రి తదితరులు అభినందించారు.

హామీలు సరే.. అమలు చేయండి

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ప్రతి ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు ఇవ్వడం తప్ప అమలు చేయడం లేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ప్రస్తుతం తాజాగా చంద్రబాబు స్పోర్ట్స్ పాలసీ తీసుకువస్తానని ఇచ్చిన హామీ కూడా అలాంటిదేనన్నారు. స్థానిక సూర్యనగర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్సీ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2000లో కూడా అప్పటి సీఎంగా చంద్రబాబు స్పోర్ట్స్ పాలసీ ప్రకటించి అమలు చేయలేదని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు అదే హామీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నా, దాని అమలుకు త్వరితగతిన చర్యలు ఏం తీసుకుంటారో స్పష్టం చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో సీఎం జగన్ రూ.100 కోట్లతో స్పోర్ట్స్ పాలసీ ప్రకటించారని గుర్తు చేశారు. దీని వల్ల ముఖ్యంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల స్థాయి పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో క్రీడా ఆణిముత్యాలు తమ క్రీడా ప్రతిభకు పదును పెట్టే అవకాశం వచ్చిందని స్పష్టం చేశారు. స్పోర్ట్స్ పాలసీ అమలుపై చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే పాఠశాల స్థాయి నుంచే క్రీడా వ్యవస్థను ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో తయారైన ఓ క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లాలంటే రవాణా ఖర్చుల కోసం స్పాన్సర్లను వెతుక్కోవాల్సి వస్తుందన్నారు. క్రీడాకారులు బలవర్ధకమైన ఆహారం కోసం నెలకు రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారని గుర్తు చేశారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉండే క్రీడాకారులకు స్పోర్ట్స్ పాలసీ ఆర్థిక అండగా ఉండేలా చేయాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు.

స్వాగతించేలా సుప్రీంకోర్టు తీర్పు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కేవలం కులం పేరుతో వేధిస్తేనే కేసులు నమోదు చేయాలన్న సుప్రీం కోర్టు తాజా తీర్పు స్వాగతించేలా ఉందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. కేవలం బాధితులు ఎస్సీ, ఎస్టీలు అయినంత మాత్రాన ఆ చట్టం వర్తించదని తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

నిండా ముంచిన నైరుతి



గత జూలైలో అల్లవరం మండలం తూర్పులంకలో వర్షాలకు సాగు చేయక నారును ఇలా వదిలేసి..



అల్లవరం మండలం డి.రావులపాలెం వద్ద జూలైలో వర్షాలకు నీట మునిగిన చేల నుంచి మోటార్లతో నీటి తోడకం (ఫైల్)

- సగటు కన్నా 22 శాతం అధిక వర్షం
- పంట నష్టం.. దిగుబడులపై ప్రభావం
- మళ్లీ వాయుగుండంతో వానలు

సాక్షి, అమలాపురం: జిల్లాను ముంచిన నైరుతి వర్షాలు.. వెళుతూ వెళుతూ కూడా తడిసి ముద్ద చేస్తున్నాయి. రైతులను నిండా ముంచేస్తున్నాయి. నైరుతి రుతు పవనాలు ఈసారి జిల్లాలో అంచనాలకు మించి వర్షాలు కురిపించాయి. జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 26వ తేదీ వరకూ జిల్లాలో సగటు వర్షం 744.7 మిల్లీమీటర్లు కాగా, ఇప్పటి వరకూ 952.9 మిల్లీమీటర్ల వర్షం కురవడం విశేషం. ఇది 22 శాతం అధికం. గత ఏడాది సాధారణ వర్షం నమోదు కాగా, ఇప్పుడు సగటు కన్నా అధిక వర్షపాతం నమోదయ్యింది.

ఆశలు.. ఆవిరి

రైతుల ఆశల సాగు ఖరీఫ్‌ను వర్షాలు.. వరదలు ముంచేశాయి. వరదల కన్నా వర్షాలతో కలిగిన నష్టం అధికం. జూలై నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఖరీఫ్ వరి నారుమడి దశలోనే నీట మునగడంతో రైతులు అధికంగా నష్టపోయారు. రెండోసారి నారుమడులు వేసిన చేలు కూడా ముంపులో చిక్కుకున్నాయి. ఇలా చాలామంది రైతులు సాగుకు దూరమయ్యారు. ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ మొత్తం వదిలేసిన రైతులతోపాటు నష్టపోయి సాగుకు దూరమైన రైతులు కూడా అధికంగానే ఉన్నారు. వర్షాలకు తోడు మురుగునీటి కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో అధికంగా నష్టపోయారు. అంచనాలకు మించి కురుస్తున్న వర్షాలు దిగుబడిని కూడా దెబ్బతీయనున్నాయి. జిల్లాలో ముమ్మిడివరం, అమలాపురం, పి.గన్నవరం, రాజోలు, రామచంద్రపురం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో దిగుబడి తగ్గనుంది. ఖరీఫ్ సగటు దిగుబడి 28 బస్తాలు (బస్తా 75 కేజీలు, 21 క్వింటాళ్లు) కాగా తీర ప్రాంత మండలాల్లో తరచూ ముంపుబారిన పడిన చేలల్లో 20 బస్తాలు కూడా దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి చేలు పాలుపోసుకునే దశలో ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలతో ధాన్యంలో పొల్లు అధికంగా వస్తోందని వారు కలవరపడుతున్నారు.

నెలవారీ కురిసిన వర్షం

నెల	కురవాల్సింది	కురిసింది	శాతం
జూన్	111.4	175.3	57.4
జూలై	241	340.1	41.1
ఆగస్టు	229.7	247.1	7.6
సెప్టెంబర్ (26వ తేదీ)	162.6	190.4	17.1


ఆగని వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ పలు ప్రాంతాల్లో దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది. రాజోలు దీవి తడిసి ముద్దయ్యింది. మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి, మామిడికుదురులో మూడు గంటల పాటు భారీ వర్షం పడింది. అమలాపురం, అంబాజీపేట. పి.గన్నవరంలో వర్షాలకు రోడ్లపై నీరు చేరింది. అమలాపురం మున్సిపాలిటీ పరిధిలో పలు రోడ్లు, అంబాజీపేటలో బొబ్బర్లంక– అమలాపురం ప్రధాన రహదారి మీద వర్షం నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీల్లో వర్షం నీరు చేరింది. చేలల్లో మూడు అడుగుల ఎత్తున ముంపు చేరడంతో రైతులు నీరు తొలగించే పనిలో పడ్డారు. ఉదయం ఎనిమిది గంటల వరకూ జిల్లాలో అత్యధికంగా అంబాజీపేట మండలంలో 9.6 మిల్లీమీటర్ల వర్షం కురవగా, రాజోలు 9.2, రాయవరంలో 8.4, కె.గంగవరంలో 8.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. ఎనిమిది తరువాత నుంచి రాత్రి వరకూ దఫదఫాలుగా భారీ వర్షం కురిసింది.

సమగ్ర సర్వే చేయాలి

అమలాపురం రూరల్: జిల్లాలో క్వాయర్, ఉద్యాన, మత్స్య, ఆక్వా ఉత్పత్తులపై దృష్టి సారించేందుకు గ్రామీణ చిన్న తరహా పరిశ్రమల పార్కు ఏర్పాటుకు సమగ్ర సర్వే చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి శాఖ, వ్యవసాయం, ఉద్యాన శాఖల అధికారులు, ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించారు. పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో రూరల్ ఇండస్ట్రియల్ పార్కులు విజయవంతం అయ్యాయని అన్నారు. వీటిని అమలు చేయడానికి పైలట్ అధ్యాయనం కోసం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, చిత్తూరు జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం కేశవవర్మ, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, పరిశ్రమల శాఖ ఏడీ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన నేతలు



తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోనసీమ జిల్లా నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రామచంద్రపురం పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, చిర్ల జగ్గిరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం


రామయ్యపాలెంలో కూలిన గోడ

గండేపల్లి: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని రామయ్యపాలెంలో శుక్రవారం ఉదయం గొర్ల శ్రీను నివాసం ఉంటున్న ఇంటి గోడ కూలి పక్కనే ఉన్న ఎర్ర కనకరాజు ఇంటి దూలాలపై పడటంతో ఆ ఇంటి పెంకులు నేల పడి గోడలు బీటలు వారాయి. సంఘటన జరిగిన సమయంలో రెండు ఇళ్లకు సంబంధించిన వారు గదిలో ఉండటంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు. అప్పటివరకూ బయట సామగ్రి శుభ్రం చేసిన కనకరాజు భార్య కనకలక్ష్మి అప్పుడే లోపలకు వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

గండేపల్లి: అదృశ్యమైన బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. ఈ నెల 23న బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ఆచూకీ లభించడంతో శుక్రవారం ఆమెను తల్లిదండ్రులకు అప్పగించినట్టు వివరించారు. మండలంలోని తాళ్లూరుకు చెందిన వ్యక్తి 2021లో, మురారికి చెందిన వ్యక్తి 2023లో అదృశ్యం కాగా సెల్‌ఫోన్ ఆధారంగా వారి ఆచూకీ తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని, సెల్ ఫోన్లు, ఇతర సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్నారు.

రత్నగిరికి పండగొచ్చింది

- దసరా, కార్తిక మాసానికి ముస్తాబు
- రూ.60 లక్షలతో హరిహరసదన్ సత్రానికి హంగులు
- మరిన్ని ఏర్పాట్లపై త్వరలోనే ఈఓ సమావేశం


రంగులు వేయక ముందు హరిహరసదన్ సత్రం


రంగులు వేశాక కళకళలాడుతున్న హరిహరసదన్ సత్రం

అన్నవరం: రత్నగిరికి పండగ శోభ వచ్చింది.. వచ్చే నెల మూడో తేదీ నుంచి దసరా వేడుకలు, నవంబర్ రెండో తేదీ నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. దీనిని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ముస్తాబవుతోంది. భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు అనుగుణంగా దేవస్థానంలో తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానంగా భక్తుల వసతి కోసం వివిధ సత్రాలకు రంగులు వేయడం, మరమ్మతులు చేయిస్తున్నారు. కార్తిక మాసంలో నెల రోజులూ లక్షలాది మంది భక్తులు స్వామివారి సన్నిధికి వస్తారు. వీరికి ఏ ఇబ్బంది కలగకుండా మరిన్ని ఏర్పాట్లు చేయడానికి త్వరలో దేవస్థానం సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ 'సాక్షి'కి వివరించారు. గత ఏడాది చేసిన ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు, కొత్తగా చేపట్టాల్సిన పనులకు అంచనాలతో సమావేశానికి హాజరు కావాలని ఇప్పటికే సిబ్బందికి ఈఓ ఆదేశాలు జారీ చేశారు.

రంగులు.. హంగులు

సత్యగిరిపై ఉన్న హరిహర సదన్ సత్రానికి రూ.60 లక్షలతో రంగులతో పాటు గదుల్లో మరమ్మతులు చేస్తున్నారు. ఈ సత్రాన్ని 139 గదులతో 2010లో అప్పటి, ప్రస్తుత ఈఓ రామచంద్రమోహన్ పర్యవేక్షణలో నిర్మించారు. ఇందులో 84 ఏసీ గదులు కాగా, మిగిలినవి నాన్ ఏసీ గదులు. దేవస్థానంలోని మొత్తం సత్రాల్లోని గదుల్లో నాలుగో వంతు గదులు ఈ సత్రంలోనే ఉన్నాయి. దీని నిర్వహణ లోపం కారణంగా కొన్ని గదులు మరమ్మతులకు గురయ్యాయి. వేసిన రంగులు కూడా వెలిసిపోవడంతో ఈ సత్రంలో గదులకు మరమ్మతులు చేసి రంగులు వేయించాలని ఈఓ ఆదేశించారు. దీంతో ఈ సత్రానికి కొత్త కళ వస్తుంది. గతంలో ఈ సత్రానికి లేత పసుపు, క్రీం కలర్ రంగులు ఉండేవి. అయితే సత్యగిరిపై గత ఏడాది నిర్మించిన 135 గదులు శివసదన్ సత్రానికి వేసిన రంగులనే ఈ సత్రానికి వేయాలని సూచించారు. దీంతో డీఈ బీఎస్ రాంబాబు ఆధ్వర్యంలో శివసదన్ సత్రానికి వేసిన రంగులను వేయడంతో హరిహరసదన్ సత్రం అందంగా కనిపిస్తోంది.

చురుగ్గా పనులు

ప్రస్తుతం హరిహర సదన్‌లో గదుల మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులు మరో 15 రోజులు కొనసాగనున్నాయి. ఈ సత్రంలో మంచాలు, పరుపులు కూడా సత్రం నిర్మించినప్పటి నుంచి మార్చలేదు. వీటిని కూడా మార్చాల్సి ఉంది. అదే విధంగా ఈ సత్రంపై, శివసదన్ సత్రంపై ఆ సత్రాల పేర్లు తెలుగు, ఇంగ్లిషులో డిజిటల్ లెటర్లతో పెట్టించాలి. రాత్రి వేళ కూడా భక్తులకు కనిపించేలా వాటిని సత్రం పైభాగంలో ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం



"కార్తిక మాసం ఏర్పాట్లపై త్వరలో దేవస్థానం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆ మాసంలో భక్తుల రద్దీ దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చిస్తాం. హరిహరసదన్ సత్రంలో ఫర్నిచర్ మార్చాల్సి ఉంది. సత్రం గదుల్లో ఇనుప మంచాలు వేశాం. అవి బాగానే ఉన్నాయి. ఎక్కడైనా మంచాలు పాడైతే కొత్తవి వేస్తాం. పరుపులు చాలా కాలమైంది. అందువల్ల వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసి వేస్తాం. కార్తికమాసం లోపు మిగిలిన సత్రాల్లో కూడా మరమ్మతులు చేసి భక్తులకు తగిన సౌకర్యాలు కల్పిస్తాం."

– కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో శనివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరగాల్సిన క్రీడాకారుల ఎంపికలు వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు సమాఖ్య కార్యదర్శి ఎల్.జార్జి, సంయుక్త కార్యదర్శి సునీల్ శుక్రవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం అండర్–14, 17 విభాగాల్లో కాకినాడలో చెస్, యోగా, కరాటే, వాలీబాల్, పిఠాపురంలో రగ్బీ ఎంపికలు జరగాలన్నారు. తదుపరి షెడ్యూల్ ఎప్పుడనేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్


గంజాయి తరలిస్తున్న యువకులను పట్టుకున్న అన్నవరం పోలీసులు

శంఖవరం: వ్యసనాలకు బానిసై అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు కథనం ప్రకారం.. కత్తిపూడి గ్రామానికి చెందిన తెరుమలకొవెల జోగేంద్ర, తొండంగి మండలం తమ్మయ్యపేట గ్రామానికి చెందిన బాదిన నూకరాజు ఒడిశా రాష్ట్రం కోరికొండ నుంచి 4 కిలోల గంజాయి ప్యాకెట్లు కాకినాడ వైపు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. కత్తిపూడి శివారు కాకినాడ రోడ్డు పోలవరం కాలువ సమీపంలో పట్టుకున్నట్లు వివరించారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను ప్రత్తిపాడు రిమాండ్‌కు పంపించామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై వి.కిశోర్, వీఆర్వో శ్రీను తదితరులు ఉన్నారు.

వాణిజ్య పంటలపై విస్తృత పరిశోధనలు


ఎన్ఐఆర్‌సీఏ-ఏపీసీఎన్ఎఫ్ అవగాహన ఒప్పందం కార్యక్రమంలో మాగంటి శేషుమాధవ్, తాతారావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకుతో పాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై విస్తృతంగా పరిశోధనలు చేపట్టే దిశగా అనేక ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయని జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ), సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక సీటీఆర్ఐ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్‌పై ఎన్ఐఆర్‌సీఏ– ఏపీసీఎన్ఎఫ్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా శేషుమాధవ్ మాట్లాడుతూ రాష్ట్ర రైతు సాధికార సంస్థ– ప్రకృతి వ్యవసాయ విభాగం (ఏపీసీఎన్ఎఫ్)తో అనుసంధానంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఎన్ఐఆర్‌సీఏ వారి సహకారంతో మార్కెటింగ్ చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాతీయ వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ)గా రూపాంతరం చెందుతున్న కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ) రాజమండ్రి వారి పరిశోధనల్లో పొగాకుతో పాటు పసుపు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటలపై సంయుక్తంగా పరిశోధనలు చేసేందుకు ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశామన్నారు. భవిష్యత్తులో ఎన్ఐఆర్‌సీఏ– ఏపీసీఎన్ఎఫ్ తరఫున నాణ్యమైన ఉత్పత్తుల లభ్యతతో పాటు మార్కెటింగ్ సౌకర్యం లభిస్తుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.తాతారావు, అడిషనల్ డీపీఎం షేక్ వలీ, భువిజ ఎన్జీఓ సంస్థ అధికారి నరసింహారావు, కేవీకే కలవచర్ల హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, సీటీఆర్ఐ విభాగాధిపతులు, ఐటీఎంయూ నోడల్ ఆఫీసర్ రవిశంకర్ పాల్గొన్నారు.

అత్యాచార కేసులో వ్యక్తికి జైలు

రాయవరం: రాయవరం గ్రామానికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో లారీ క్లీనర్‌కు 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్ కోర్టు న్యాయమూర్తి బి.బెన్నయ్యనాయుడు శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు విలేకరులకు తెలిపారు. గ్రామంలోని పోలమ్మ పుట్ట వద్ద రేకుల షెడ్డులో వృద్ధురాలు నివాసం ఉండేది. వృద్ధురాలి నివాసానికి సమీపంలో ఉన్న రైసుమిల్లులో కరప మండలం వేళంగికి చెందిన నొక్కు వెంకరమణ అనే వ్యక్తి లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. 2023 ఫిబ్రవరి 7వ తేదీ తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో బాధితురాలు ఒంటరిగా ఉన్న సమయంలో వెంకటరమణ ఇంట్లోకి చొరబడి, ఆమెపై అత్యాచారానికి తెగబడ్డాడు. వృద్ధురాలు వేసిన కేకలకు పక్కనే నివాసం ఉంటున్న రేలంగి నాగేశ్వరరావు, అతని భార్య వెళ్లి ఘటనా స్థలంలోనే నిందితుడ్ని పట్టుకుని రాయవరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై అప్పటి స్టేషన్ ఎస్సై పి.వీరసత్యసూర్య నాగసురేష్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ ఎస్.గౌరీశంకర్ దర్యాప్తు చేసి, ముద్దాయి వెంకటరమణను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు రాజమహేంద్రవరం 8వ కోర్టు క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్ నందు ట్రయల్స్ జరిగాయి. వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి బి.బెన్నయ్యనాయుడు నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షన, ఒక ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం
M.S.N. క్యాంపస్, అచ్చంపేటరోడ్డు, కాకినాడ.
ఓపెన్ ఆక్షన్ నోటీసు
కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం నందు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం M.S.N.క్యాంపస్, వారి స్వాధీన పరిధిలో గల ఎ. 50.93 సెంట్లు మామిడి మరియు కొబ్బరి ఫలసాయం ఒక పంట సంవత్సరముకు అనుభవించుటకు టెండరు షరతులతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, M.S.N.క్యాంపస్, ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ది. 15.10.2024 మధ్యాహ్నం 3 గంటలకు ఓపెన్ ఆక్షన్ వేయబడును. టెండర్ షరతులు మరియు తదితర వివరాలు కొరకు AKNU M.S.N.క్యాంపస్, ప్రిన్సిపల్ వారి కార్యాలయం నందు కార్యాలయ పనివేళలో 10AM to 5PM సంప్రదించవచ్చును.
తిమ్మాపురం, అచ్చంపేటరోడ్డు, కాకినాడజిల్లా
తేదీ 26-09-2024
రిజిస్ట్రార్
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

14 ఏళ్లకు పాఠశాల వార్షిక తనిఖీ

తాళ్లూరు హైస్కూల్‌లో ఘటన


తాళ్లూరు హైస్కూల్లో వార్షిక తనిఖీలో భాగంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

గండేపల్లి: ప్రతి ఏడాది పాఠశాలలో బోధనా అంశాల తీరును పరిశీలించాల్సిన అధికారులు 14 ఏళ్ల తర్వాత వార్షిక తనిఖీ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. గండేపల్లి మండలం తాళ్లూరు జెడ్పీ స్కూల్‌లో ఈ వింత ఘటన చోటుచేసుకుంది. 14 ఏళ్ల నుంచి ఇప్పటి వరకూ సంబంధిత అధికారులు పాఠశాలలను తనిఖీ చేయకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మారిన పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల బోధన, పాఠశాల రూపురేఖలు, పరిశుభ్రత తదితర అంశాలు పరిశీలించాల్సిన అధికారులు ఇక్కడకు ఒక్కసారి కూడా రాకపోవడం శోచనీయం.ఇదిలా ఉండగా అక్కడ సమాచారం తెలిపే పాఠశాల బోర్డులో సుమారు 8 నెలల కిందట బదిలీ అయిన విద్యాశాఖాధికారి పేరు ఉండటం గమనార్హం. శుక్రవారం మల్లేపల్లి, తాళ్లూరు జెడ్పీ స్కూళ్లను శుక్రవారం ఇన్‌చార్జి డీవైఈఓ ఎస్.వెంకటేశ్వరరావు వార్షిక తనిఖీ చేశారు. తాళ్లూరు స్కూల్‌కు అధికారులు రాగానే విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ ఏడుగురు ప్యానల్ టీచర్లతో కలసి ఈ తనిఖీలు చేశామన్నారు. సుమారు 2010 నుంచి వార్షిక తనిఖీలు జరగకపోవడంతో ఇప్పుడు తనిఖీలు నిర్వహించామన్నారు. డీవైఈఓలకు ప్రమోషన్లు ఇవ్వకపోవడం, ఇన్‌చార్జులు కావడంతో తనిఖీలు జరగలేదన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీవైఈఓగా ఎస్.వెంకటేశ్వరరావు బాధ్యతలు నిర్వహిస్తుండగా, పాఠశాల వద్ద సమాచార బోర్డులో బదిలీపై వెళ్లిన గత డీవైఈఓ డి.సుభద్ర పేరు ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ కమిటీలు అయోమయానికి గురవుతున్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై చర్యలు


తెలికిచెర్లలో బాణసంచా గొడౌన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల: ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ ఉంచి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ప్రకాశరావుపాలెం, తెలికిచెర్లలో ఉన్న బాణసంచా గొడౌన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగానే బాణసంచా కొనుగోలు చేసి నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బాణసంచా విషయంలో తగిన భద్రతా ప్రమాణాలు పాటించి విక్రయాలు సాగించాలన్నారు. దసరా సందర్భంగా ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు, కోడిపందేలు, పేకాటలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై హరిబాబు తదితరులు ఉన్నారు.

జెడ్పీ సీఈఓగా లక్ష్మణరావు బాధ్యతల స్వీకరణ


జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మణరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారిగా (సీఈఓ)గా వీవీవీఎస్ లక్ష్మణరావు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కాకినాడ నగరంలో ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఇన్‌చార్జి జిల్లా పరిషత్ సీఈఓ పాటంశెట్టి నారాయణరావు బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణరావు డ్వామా విభాగంలోని గరివిడి క్లస్టర్ ఏపీడీగా పని చేస్తూ పదోన్నతిపై సీఈఓగా కాకినాడ జెడ్పీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ విభాగాధిపతులు, ప్రజాప్రతినిధులతో కలసి జిల్లా పరిషత్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. లక్ష్మణరావును జిల్లా పరిషత్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం సీఈఓ లక్ష్మణరావు కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎక్కువ వడ్డీకి ఆశపడి డిపాజిట్ చేశాం



మహాజన సభలో మాట్లాడుతున్న జయలక్ష్మి సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు

- ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నాం
- 'జయలక్ష్మి' డిపాజిటర్ల ఆవేదన

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఎక్కువ వడ్డీ వస్తుందని ఆశ పడి తమ వద్ద ఉన్న డబ్బులు మొత్తం జయలక్ష్మి బ్యాంకులో డిపాజిట్లు చేసి మోసపోయామని పలువురు డిపాజిటర్లు ఆవేదన వెల్లబుచ్చారు. వయసులో ఉండగా సంపాదించిందంతా బ్యాంకులో వేస్తే ప్రస్తుతం అనారోగ్యం వస్తే చేతిలో చిల్లిగవ్వ కూడా లేదని బాధ వెళ్లగక్కారు. ది జయలక్ష్మి ఎంఏఎం కో ఆపరేటివ్ సొసైటీ మహాజన సభ శుక్రవారం స్థానిక దంటు కళాక్షేత్రంలో నిర్వహించారు. సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ రూ.కోట్లు డిపాజిట్లుగా సేకరించి, వాటిని ఇష్టానుసారంగా ఆర్థిక మోసానికి పాల్పడ్డారన్నారు. రెండేళ్ల నుంచి ఇప్పటి వరకూ రూ.ఐదు కోట్లను రుణగ్రస్తుల నుంచి వసూలు చేయగా, మరో రూ.ఆరు కోట్లను సీబీసీఐడీ సీజ్ జేసిన బ్యాంకు ఖాతాల్లో ఉందన్నారు. అలాగే సుమారు రూ. 500 కోట్ల రుణాలు తీసుకుని చెల్లించని వారి ఆస్తులను సీబీసీఐడీ స్వాధీనం చేసుకుని జప్తు చేసిందన్నారు. కోర్టు నుంచి సేల్ ఆర్డర్ వచ్చిన తరువాత దీని అమ్మడం ద్వారా బాధితులకు ఇస్తామన్నారు. బ్యాంకులో రూ. 700 కోట్ల స్కామ్ జరిగిందన్నారు. అలాగే సొసైటీకి తనఖా పెట్టిన ఆస్తుల విలువ మరో రూ.497 కోట్ల వరకూ ఉంటుందని, వాటిపై సివిల్ కోర్టులో కేసు వేసి రాబట్టేందుకు విజయవాడలోని కో ఆపరేటివ్ ట్రిబ్యునల్‌లో సంప్రదించామన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్లు రానున్న నేపథ్యంలో బాధితులెవరూ అధైర్య పడవద్దన్నారు. ఇప్పటి వరకూ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో వాటిని చూసేందుకు సమయం పట్టిందని, అలాగే ఇటీవలే ఈడీ సైతం విచారణ మొదలు పెట్టిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి వసూలైన వాటిలో రూ.యాభై కోట్లను బాధితులకు కనీసం పదో వంతు పంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ బాధితులు 10 మంది వరకూ చనిపోయారని, వారి కుటుంబాలకు డబ్బులు ఇస్తామన్నారు. సొసైటీ స్కామ్ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి వివరించామని, త్వరలో మరోసారి కలిసి న్యాయం చేయాలని కోరుతామన్నారు. ఈలోపు ప్రభుత్వం నుంచి సొసైటీకి రూ. 200 కోట్లు అప్పుగా ఇవ్వాలని కోరామని, ప్రభుత్వ పరంగా ఏమైనా అప్పు అందితే బాధితులకు కొంతమేర చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తమ పాలకవర్గంపై కొందరు సభ్యులు పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నారని, వాటిని మానుకోవాలన్నారు. పారదర్శకంగా పాలన చేస్తున్నామని, ఇందులో ఎటువంటి దాపరికం లేదన్నారు. ఈ సందర్భంగా తీర్మానాలు ప్రవేశపెట్టే సమయంలో పలువురు సభ్యులు వాటిని వ్యతిరేకించి అడ్డుకునే ప్రయత్నం చేయగా, సభలో కాసేపు రసాభాసగా మారింది. సభలో సభ్యులు సీహెచ్ సుబ్బారావు, రమణమూర్తి, కె.గౌరీశంకరావు, రవికుమార్, ఎ.శ్రీనివాసు, సురేష్‌తో పాటు బ్యాంకు సభ్యులు సుమారు 550 మంది హాజరయ్యారు.

గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి


పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ రూరల్: గంజాయి రవాణా అరికట్టడానికి ప్రత్యేక దృష్టి సారించామని, దీనికి గాను రాష్ట్రంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీ అశోక్‌కుమార్ చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కాకినాడ రూరల్ తిమ్మాపురం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఐజీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా నుంచి ఏజెన్సీ వరకూ ఉన్నా రహదారుల్లో ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రతి చోటా సీసీ కెమెరాలు పెడుతున్నామన్నారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఐజీపీ వెంట జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ, సీఐలు ఉన్నారు.

ఆర్చరీ, స్విమ్మింగ్‌లో ప్రతిభ


తొర్రేడులో ఆర్చరీ, స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం సాయిబాబు

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన ఆర్చరీ, స్విమ్మింగ్ పోటీల్లో తొర్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపి స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారు. అండర్– 14 ఆర్చరీ ఇండియన్ విభాగంలో టి.గీతిక (ఏడో తరగతి), అండర్–17లో కె.అమూల్య (10వ తరగతి), అండర్–17 బాలుర విభాగంలో పి.యశ్వంత్, కె.ఉపేంద్ర (10వ తరగతి), రికర్వ్ విభాగంలో జాన్సన్ (10వ తరగతి), అండర్–14లో జి.రాహుల్ (6వ తరగతి), సీహెచ్ నవీన్ (7వ తరగతి), కాంపౌండ్ విభాగంలో జి.ప్రవీణ్‌కుమార్, కె.చైతన్య, విజయలక్ష్మి ప్రతిభ కనబరిచారు. స్విమ్మింగ్ అండర్–17లో 200 మీటర్లు బాక్ స్ట్రోక్‌లో ఐ.రవికిరణ్ (10వ తరగతి) ఎంపికయ్యారు. ఏఎస్ఆర్ జిల్లా పార్వతీపురంలో జరిగే స్టేట్ మీట్‌లో వీరు పాల్గొంటారు. విజేతలు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సాయిబాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ రాజమండ్రికి అతి చేరువలో గేటెడ్ కమ్యూనిటీ నందు ఇంటి నిర్మాణానికి అనువుగా గల అప్రూవ్డ్ లే-అవుట్ నందు ఓపెన్ ప్లాట్స్, కమర్షియల్ బిట్స్ అమ్మకమునకు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర॥ 9703 877 977 [R-945]

FOR SALE

■ కాకినాడ నుండి యానాం రోడ్డు నందు గల 21 ఎ॥ రొయ్యల చెరువులు అమ్మబడును. ప్రస్తుత లీజు సంవత్సరానికి ఒక ఎకరాకు 1,30,000/- లభిస్తుంది. ఆసక్తి గలవారు సంప్రదించండి. డైరెక్ట్ - 88882 65996 [R-1260812]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2563]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18k. ఫోన్: 9640258899, 9640468899 [H-796281]

■ హైదరాబాద్‌లో ప్రముఖ యూనివర్సిటీలో 200 మంది (Ex-Army) సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. (జీతం:8Hrs. 19,500/- & 12 Hrs. 28,200/-, 4సెలవులు + ఉచిత వసతి).ఫోన్: 9959433789 [H-804876]

■ కన్సల్టెన్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు,ఫ్రీ రూమ్+భోజనం. HYD.7995365999. [HA-98562]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185455]

■ కాకినాడ FOTON DOORS కంపెనీ నందు పనిచేయుటకు Marketing Executives (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి. సంప్ర॥ 88826 56789 [R-1260813]

■ RICY క్లీనింగ్ ప్రొడక్ట్స్ కంపెనీకి అన్ని మండలాల నుండి సేల్స్ మేనేజర్స్ జీ: 25K, టెలికాలర్స్, జీ॥ 20K డెవలప్‌మెంట్ మేనేజర్స్ జీ॥ 30K కావలెను. ✆ : 93927 21216 [R-1229098]

■ ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంపెనీలో Team Leaders అమలాపురం మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలలో పనిచేయుటకు M/F కావలెను. Q:10th Above. ✆ : 93930 55164 [R-1229099]

■ Wanted for Diagnostic centre (Kakinada & Amalapuram) Lab Technician 2 Nos (M/F), X-ray Technician 2 Nos (M/F). Cont: 9676810372, 9397662312 [C-800082]

■ Wanted Field Collection Executives & Team Leaders to Work in Banking Sector, Good Salary + Incentives. Cont. Time - 10AM - 6PM. Cont : 75695 94326, 98496 83296 [V- 823858]

■ ప్రముఖ వ్యాపార సంస్థలో వర్క్ చేయుటకు Age 35 సం॥ పైబడి చీఫ్ మేనేజర్స్ కావలెను. గృహిణులు కూడా అర్హులు (Retd. Employ & Private Employ కి ప్రాధాన్యత కలదు) కాంటాక్ట్ ✆ : 94907 45099 [R-6989]

■ RK ఇంజనీరింగ్ కాలేజి బాయ్స్ హాస్టల్ నందు పనిచేయుటకు వార్డెన్స్, వంట మాస్టర్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ కావలెను. మంచి జీతం +భోజనం+ఉచిత వసతి కల్పించబడును. సంప్ర॥ కేతనకొండ గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం విజయవాడ. సెల్ : 9701473399 [G-209]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.